సర్కారు బడి.. ఆదర్శ ఒడి


పాఠశాల తరగతి గదిపై రైలు చిత్రం


తరగతి గదుల్లో డెస్కులపై కూర్చున్న విద్యార్థులు

- కార్పొరేట్ హంగులతో జోగాపూర్ ప్రాథమిక పాఠశాల
- ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా విద్యాబోధన
- మన ఊరు.. మన బడి నిధులతో అభివృద్ధి

చందుర్తి: ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యతో మూతబడే స్థితిలో ఉండే మండలంలోని జోగాపూర్ ప్రాథమిక పాఠశాలను కాపాడాలని గ్రామస్తులు ఏకమయ్యారు. గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకే పంపించాలన్న ఉపాధ్యాయుల పిలుపుకు గ్రామస్తుల సహకారం తోడైంది. పాఠశాల సమగ్ర అభివృద్ధికి మన ఊరు–మన బడి నిధుల నుంచి రూ.19.65 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పాఠశాలలో గదుల కొరతతో పాటు మౌలిక వసతులు కల్పించారు. మంజూరైన నిధులతో పాఠశాలను సర్వాంగ సుందరంగా మార్చారు. విద్యార్థులను ఆకర్షించేలా పాఠశాల భవనానికి రైలు చిత్రపటం ప్రత్యేక ఆకర్షణగా మారింది.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా...

గ్రామంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులతో పాటు ప్రజాప్రతినిధుల సమష్టి కృషికి గ్రామస్తులు సహకారం అందించారు. ఉపాధ్యాయుల కొరతతో సరైన విద్యాబోధన అందడం లేదని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించారు. ఇలాగైతే పాఠశాల మూతబడే స్థితికి చేరుకుంటుందని భావించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల కిషన్ ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలకు పంపించే వారి తల్లిదండ్రులతోనే కాకుండా స్కూల్‌కు వచ్చేవారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనపై అవగాహన కల్పించారు. పాఠశాలను కాపాడుకునే బాధ్యత గ్రామస్తులపైనే ఉందని తెలపడంతో వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించడంతో విద్యార్థుల సంఖ్య 130కి పైగా చేరుకుంది. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండడంతో గ్రామస్తులే ఇద్దరు వలంటీర్లను ఏర్పాటు చేశారు.

కార్పొరేట్ హంగులతో..

పాఠశాలకు వచ్చే విద్యార్థుల మనస్సును ఆకట్టుకునేలా పాఠశాల భవనాలకు రైలుచిత్ర పటాన్ని, గదులకు బోగీ డబ్బాల రంగులు వేయడం ఆకట్టుకుంటోంది. తరగతి గదుల్లో రంగురంగుల డెస్కులను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ పాఠశాలను మరిపించే రీతిలో ముస్తాబు చేశారు. పాఠశాల ఆవరణలో సర్వసతి విగ్రహంతో పాటు పాఠశాల ప్రాంగణమంతా పచ్చదనంతో నిండింది. మన ఊరు – మన బడి నిధుల మంజూరుతో పాఠశాలను అభివృద్ధి చేశారు. తరగతి గదితో పాటు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మూత్రశాలలు, మౌలిక వసతులు కల్పించారు.

సర్కారు బడికే పంపేలా..



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలపై స్వశక్తి మహిళా సంఘాలతో చర్చిస్తున్నాం. ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలకు పంపించేలా తీర్మానం చేసుకున్నాం.

– గడ్డం రాధ, అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, జోగాపూర్

విద్యార్థుల సంఖ్య పెరిగింది



ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయుల కృషికి తగినట్లుగా గ్రామస్తులు సహకారం అందించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వలంటీర్లను ఏర్పాటు చేసి వారి బాధ్యతను గ్రామస్తులే తీసుకున్నారు.

– మ్యాకల గణేశ్, ఎంపీటీసీ, జోగాపూర్

సమస్యలు తీరాయి



పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులే కాకుండా జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లినవారు సైతం ముందుకొచ్చారు. పాఠశాలలో ప్రొజెక్టర్ ఏర్పాటు చేసేందుకు రూ.30 వేలు అందించారు. మన ఊరు.. మన బడికి నిధులు మంజూరు కావడంతో స్కూల్‌లో సమస్యలు తీరాయి.

– ఎడ్ల కిషన్, ప్రధానోపాధ్యాయుడు, జోగాపూర్

క్లుప్తంగా

ప్రతాప రామకృష్ణకు పరామర్శ



వేములవాడ: గుండె చికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

సిరిసిల్ల: పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌కు చెందిన కుడిక్యాల నాగరాజు అనే నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి పద్మశాలీ సంఘం రూ.20వేల ఆర్థికసాయంగా అందించింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఇక్కడ సిరిసిల్ల పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ ప్రధాన కార్యదర్శి మండల సత్యం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, ప్రతినిధులు మోర రవి, డాక్టర్ గాజుల బాలయ్య, ఎల్లప్ప తదితరులున్నారు.

నేడు దత్తాత్రేయస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గుట్టపై ఉన్న శ్రీ గురుదత్తాత్రేయ స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు ఆదివారం తెలిపారు. శృంగేరి పీఠం వేద పండితుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు దత్త హారతి ఉంటుందని, కరీంనగర్ నీలకంఠభజన మండలి వారితో భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 15 వాహనాల యజమానులకు జరిమానాలు విధించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీ టు పీజీ క్రీడా ప్రాంగణం ఆదివారం సందడిగా మారింది. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ పేరుతో పోలీసులు, జర్నలిస్టులు ఉల్లాసంగా, ఉత్సాహంగా క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. స్వల్ప తేడాతో పోలీసుల జట్టు కప్‌ను కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో ఎస్సై రామ్మోహన్, విలేకరుల సంఘం అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాస్, యాదగిరిగౌడ్, సయ్యద్ సాధత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట: అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను ఆదివారం ఎల్లారెడ్డిపేట శివారులో పట్టుకున్నట్లు తహసీల్దార్ రాంచందర్ తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. మండలంలోని చెరువులు, గుట్టలు, ఇతర ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా మట్టి, మొరం తరలిస్తే యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మట్టి తరలింపుపై గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

లాడ్జీలపై దాడులు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని 49 లాడ్జీల్లో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అంజయ్య, ఎల్లాగౌడ్, పోలీసు సిబ్బంది, డిస్ట్రిక్ట్ గార్డ్స్ ఏకకాలంలో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని లాడ్జీలపై దాడులు నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. లాడ్జిల్లో సీసీ కెమెరాలు, వ్యక్తుల పూర్తి వివరాలను తెలుసుకున్నారు.

వనభోజనాలకు వెళ్లిన ప్రజలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు పల్లెలు ఆదివారం అడవిబాట పట్టాయి. ఏటా గ్రామ దేవతలకు పూజలు చేసి వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, అల్మాస్‌పూర్, రాజన్నపేట, పదిర, హరిదాస్‌నగర్, బండలింగంపల్లి తదితర గ్రామాల్లో వివిధ కులసంఘాలు వనభోజనాలకు వెళ్లారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు మేలు

కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా అన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, విప్ ఆ ది శ్రీనివాస్ చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ చారి, జిల్లా నాయకులు చందనగిరి గోపాల్, తాళ్లపెల్లి ప్రభాకర్, కచ్చకాయల ఎల్లయ్య, గొట్టె రుక్మిణీ, బొర్ర రవి, నాయకులు శేఖర్, ప్రభాకర్, సుంకరి రెడ్డి, దేవరాజు, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేట: హరిదాస్‌నగర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలం హరిదాస్‌నగర్‌లో కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆనాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ మల్లారెడ్డి, నాయకులు రోడ్డ రామచంద్రం, అనిల్, విజయ్, రాజిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ రైతుల ప్రభుత్వమన్నారు. రైతుల రుణమాఫీకి కేబినెట్ ఆమోదం పొందడం హర్షణీయమన్నారు.

ఘన నివాళి


ముస్తాబాద్‌లో శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

ముస్తాబాద్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మండలకేంద్రలంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. చిత్రపటం వద్ద పూలమాలవేసి నివాళి అర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, వెంకన్న, గిరిధర్ రెడ్డి, చిట్నేని శ్రీనివాస్‌రావు, గోపి, మహేశ్, రమేశ్ ఉన్నారు.

కోనరావుపేట: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మండలకేంద్రంతోపాటు ధర్మారంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ధర్మారంలో రావిమొక్క నాటారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు గొట్టె రామచంద్రం, మిర్యాల్‌కార్ బాలాజీ, మోతుకు మోహన్, జింక వెంకటి, వెలిశాల రవీందర్, ఆకుల నాగరాజు, చల్ల జితేందర్, అన్నవేని అభిషేక్, ఎర్రం సతీశ్, బాలకిషన్, విజయ్, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ మండల ప్రధానకార్యదర్శి ఎడపల్లి పరశురాం, నాయకులు ఉదారి నర్సింహాచారి, బోగోజి గంగాధర్‌చారి, రాజూరి కిరణ్, మెరుపుల గంగాధర్, మొగులోజి రమేశ్, మహేశ్, అనీల్, రజని కాంత్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధాన కార్యదర్శి కాశి చరణ్, ఉపాధ్యక్షుడు ఇటికల వినయ్ యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ కన్నె అరుణ్ కుమార్, ఎర్రోళ్ల బాలయ్య, కుక్కల బాలయ్య తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశానికి హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు

వేములవాడఅర్బన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఏసురత్నం, జైపాల్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, కడారి రాములు, వేణు, అనసూర్య, రవీందర్, నర్సయ్య, మల్లేశం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపిక పోటీలు

వీర్నపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకోసం సోమవారం ఆదర్శ పాఠశాలలో మండలస్థాయి ఎంపికపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ దూ స రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 99492 50618 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కారు బోల్తా

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొత్తపేట శివారులో ఓ కారు బోల్తా పడింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం వెంకట్రావుపల్లి నుంచి మల్లాపూర్ వైపు కారులో వెళ్తున్నారు. కొత్తపేట శివారులో వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారని గ్రామస్తులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన బాద రాజు అనే రైతు ఆదివారం బస్టాండ్ నుంచి ఇంటి వెళ్తుండగా రైతు చర్చా మండలి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి.

పదోన్నతులు చేపట్టాలి: పీఆర్టీయూ

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ


మాట్లాడుతున్న హరికృష్ణ

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న టీచర్ల పదోన్నతులు, బదిలీల్లోనే గతంలో ఇచ్చిన హామీమేరకు హెచ్ఎం పోస్టులకు పదోన్నతులు చేపట్టాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 317 జీవో బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. 30 ఏళ్లుగా అప్‌గ్రేడేషన్‌కు నోచుకోని పీఈటీ, భాషా పండితుల కలను సాకారం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు శీలం రమేశ్, సుభాష్‌రెడ్డి, హరిందర్‌రెడ్డి, వెంకటరమణ, శిరోమణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: గత 30 ఏళ్లుగా అప్ గ్రేడేషన్‌కు నోచుకోని పీఈటీ, భాషా పండితుల కలను సాకారం చేసినందుకు ప్రభుత్వానికి జిల్లా పీఆర్టీయూ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలో జిల్లా పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సుమారు 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులను పదోన్నతి ద్వారా ఇదే షెడ్యూల్‌లో పూర్తి చేయాలని కోరారు. అలాగే 317 జీవో బాధితులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అన్నింటిలో స్కావెంజర్లను వెంటనే నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు శీలం రమేశ్, శిరోమణి, సరోజ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు అనిల్

వేములవాడఅర్బన్: ప్రైవేట్ పాఠశాలలపై మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వేములవాడ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంలాగా మారుస్తున్నాయన్నారు. యూనిఫామ్స్, బుక్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. త్వరలోనే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. విద్యార్హత, ఫీజుల బోర్డును ఏర్పాటు చేసేలా మండల విద్యాధికారి చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతుతలు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారరు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల దీలిప్, రాకేశ్, సందీప్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కమలాకర్‌రెడ్డి

గంభీరావుపేట: లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా నేవూరి కమలాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నరసింహారాజు, కోశాధికారిగా గొల్లపల్లి నాగరాజు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, పంతులవారి శంకర్, సంతోష్‌రెడ్డి, ఎర్ర శ్రీనివాస్, చేపూరి కిషన్, ప్రశాంత్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రుద్రంగి: మండలకేంద్రంలోని శివారు అటవీప్రాంతంలో పేకాడుతున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. కొందరు పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.20,330 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఐదుగురు పరారైనట్లు తెలిపారు. పేకాడుతున్న పది మందిపై కేసు నమోదు చేశామన్నారు.



ప్రారంభానికి సిద్ధం

వేములవాడరూరల్: వేములవాడ ఎమ్మెల్యే కార్యాలయం త్వరలో ప్రారంభం కానుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.కోటితో ప్రారంభించిన పనులు ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తయ్యాయి. నాలుగు సంవత్సరాలుగా ఈ భవనం పనులు సాగగా.. మరికొద్ది రోజుల్లో భవనాన్ని ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. నాలుగు రోజులుగా పనులు శరవేగంగా సాగుతున్నాయి.

మృతుల కుటుంబాలకు పరామర్శ


చందుర్తి : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

చందుర్తి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను హైదరాబాద్ పట్టణం కొంపల్లిలోని ఆయన నివాసంలో జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సత్యం సతీమణి రూపాదేవి నాలుగు రోజులుగా మృతిచెందగా జెడ్పీటీసీ కుమార్ పరామర్శించి ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతుపూరి బాలకృష్ణారెడ్డి తదితరులున్నారు.


ఎల్లారెడ్డిపేట: మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మునిగె దేవయ్య తండ్రి ఎల్లయ్య వారం క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు అందే సుభాష్, తదితరులున్నారు.

వీర్నపల్లి: మండలంలోని భూక్యతండాకు చెందిన సీనియర్ నాయకుడు లింబ్యానాయక్ ఇటీవల బస్సులో గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పరామర్శించారు. మండలాధ్యక్షుడు భూత శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు తిరుపతి, నాయకులున్నారు.

గంభీరావుపేట: ముచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతల లక్ష్మీపతి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండలశాఖ అధ్యక్షుడు హమీద్, మండల నాయకులు, తదితరులున్నారు.

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేటలో రైతు ఎల్లాల తిరుపతిరెడ్డి, మల్లారం ఎంపీటీసీ తిరుపతి తల్లి నర్సమ్మ మృతిచెందగా బాధిత కుటుబాలను ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎంపీపీ బండ మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, బాల్‌రెడ్డి, తిరుపతి, అంజయ్య, దేవరాజుగౌడ్, రవి, దేవయ్య, ప్రవీణ్‌గౌడ్, కట్కం మల్లేశం, పసుల అంజిబాబు, తీగల శ్రీనివాస్‌గౌడ్ తదితురులున్నారు.

నిర్మించారు.. వదిలేశారు



కోనరావుపేట: రూ. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారడంతో గ్రామీణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో రూ.20 లక్షల వ్యయంతో ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జనవరి 17న ప్రారంభించారు. ఇప్పటివరకు అది నిరుపయోగంగా మారింది. గ్రామంలోని మరో అద్దె భవనంలో వైద్యసేవలు అందిస్తున్నారు. అసౌకర్యాల అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి మార్చి సేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన 1983-84 పదో తరగతి పూర్వ విద్యార్థులు


1994-95 పూర్వ విద్యార్థులు


జిల్లెల్ల 2004-05 పదో తరగతి విద్యార్థులు

తంగళ్లపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. తంగళ్లపల్లిలో 1983-84లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని ఆనందంగా గడిపారు. తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1994-95లో చదివిన పదో తరగతి బ్యాచ్, జిల్లెల్లలో 2004-05లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఘనంగా గురువులను సన్మానించారు.